క్లుప్తంగా

రక్తదానం చేయాలి



ఆత్మకూర్: రక్తదానం మహాదానమని, ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని మాజీ ఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్, వివేకానంద సేవా సమితి నిర్వాహకులు దివాన్జీ ప్రభాకర్‌రావు, మాస్టర్ బాలు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా.. 74 మంది రక్తదానం చేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో యాదగిరిశెట్టి, సంతోష్‌కుమార్, కోట్ల వెంకటేష్, లింగన్న, రాజేష్, విజయ్, సంధ్య, మ్యాడం శ్రీను, అనిల్, మహేందర్, పరమేష్, భీమయ్య, స్థానికులు పాల్గొన్నారు.

'అమ్మకు గౌరవం' కేంద్రం ప్రారంభం



ఆత్మకూర్: వాసవీక్లబ్, వనితాక్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన అమ్మకు గౌరవం కేంద్రాన్ని వాసవీక్లబ్ గవర్నర్లు రామకృష్ణ, రమేష్‌శెట్టి ప్రారంభించారు. శుక్రవారం ఆత్మకూర్‌లోని బస్టాండ్‌లో చంటి పిల్లలు తల్లులు పాలనిచ్చేందుకు ప్రత్యేక గది ఏర్పాటుతో అమ్మకు గౌరవం లభిస్తోందని నిర్వాహకులు అన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్, వనితాక్లబ్ నిర్వాహకులు నీలేష్, కల్వ రఘు, నవీన్, తాండూర్ పవన్‌కుమార్, యెలిశెట్టి రాము, వీనశ్రీ, అర్చన, సుమశ్రీ, ఆర్యవైశ్య సంఘం నాయకులు కల్వ రాజయ్య, వెంకటస్వామి, నాగరాజు, సిద్దేశ్వర్, రమేష్, సింగం ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

భోజనం నాణ్యతగా అందించాలి



పాన్‌గల్: మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, సామర్థ్యాలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎంలు ప్రతినిత్యం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తూ మెనూ ప్రకారం నాణ్యతగా అందేలా చూడాలని సూచించారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించగా వారు సామధానాలు చక్కగా చెప్పడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అలివేలు, సీఆర్పీ గోవింద్, ఐఈఆర్పీ కేశవులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం



కొత్తకోట రూరల్: తెలంగాణ ముస్లింలు వచ్చే నెల 6 నుంచి 8 వరకు పరిగి పట్టణ కేంద్రంలో తబ్లీగ్ ఇస్తేమాను నిర్వహించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.2.50కోట్లు నిధులు మంజూరు చేయడంపై కొత్తకోట కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు లతీఫ్, సలీంఖాన్, ముజీఫ్ మాట్లాడుతూ తబ్లీగ్ ఇస్తేమా 250 ఎకరాల్లో జరుగుతుండటంతో వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద మనస్సుతో చీఫ్ సెక్రెటరీకి జీఓ జారీ చేయాలని సూచించడం సంతోషకరమన్నారు. తబ్లీగ్ ఇస్తేమా జరిగే ప్రదేశంలో భక్తులకు కరెంట్, తాగునీరు, బాత్‌రూంలతో పాటు అన్ని రకాల వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారని, ముస్లింల గౌరవాన్ని కాపాడే సీఎం రేవంత్‌రెడ్డికి రాష్ట్రంలోని ముస్లింలు అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ముస్తఫా, ఖలీల్, హబీబ్, ఏజాజ్, మతీన్, అజహర్, నజీమ్ తదితరులు ఉన్నారు.

జిల్లాస్థాయి టీ-10 క్రికెట్ టోర్నీ ప్రారంభం

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలోని బాలుర కళాశాల మైదానంలో వనపర్తి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి టీ-10 టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్, కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్ ప్రారంభించారు. 7 రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో 40 జట్లు పాల్గొంటాయని.. మొదటిరోజు శుక్రవారం మూడు జట్లు తలపడగా బలిజపల్లి, నాగమ్మతండా, వనపర్తి నక్షత్ర గ్రాండ్ జట్లు గెలుపొందినట్లు నిర్వాహకులు ప్రకాశ్‌రెడ్డి, రఫీక్, తిరుపతి, మూర్తి తెలిపారు. ప్రారంభోత్సవ కౌన్సిలర్లు బి.వెంకటేష్, సుమిత్ర, జయసుధ, చీర్ల సత్యం, విభూది నారాయణ, లక్ష్మి, మాజీ కౌన్సిలర్ కృష్ణబాబు, నాయకులు పాల్గొన్నారు.



రంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..



వనపర్తి బాలుర స్కూల్‌లో..



ఆత్మకూర్‌లో..

గణిత మేధావి శ్రీనివాస రామానుజన్

వనపర్తిటౌన్: గణిత శాస్త్రంలో ఎన్నో సూత్రాలను కనుగొని, ఎంతో మంది మేధావులను నివ్వెరపరిచిన శ్రీనివాస రామానుజన్ సేవలు మరువలేనివని ప్రభుత్వ బాలికల, బాలుర ప్రధానోపాధ్యాయులు, రేడియంట్ పాఠశాల డైరెక్టర్ రాములుయాదవ్ కొనియాడారు. శ్రీనివాస రామానుజన్ జయంతిని జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకోవడం ఆయనకిచ్చే ఘన నివాళి అన్నారు. శుక్రవారం బాలికల, బాలుర ఉన్నత పాఠశాల, రేడియంట్ స్కూల్‌లో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు రామానుజన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గణిత ఉపాధ్యాయుడు కె. రాజ్‌కుమార్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రాజేశ్వరి, అనిత, శ్రీవాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో, విశ్వభారతి హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన విద్యార్థుల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా ఎంఈఓ భాస్కర్‌సింగ్ మాట్లాడుతూ గణిత మేధావి శ్రీనివాసరామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ బాలరాజు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే అవోపా ఆధ్వర్యంలో ఆత్మకూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో, తిప్డంపల్లిలోని ప్రభుత ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు.

పాన్‌గల్: గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు శుక్రవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేతేపల్లి ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు 50కి పైగా గణిత ప్రదర్శనలు ప్రదర్శించారు. దీంతో పాటు ఉపన్యాసం, వ్యాసరచన, చిత్రలేఖన, పాటల పోటీలను నిర్వహించినట్లు పాఠశాల హెచ్‌ఎం రవికుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని కళాశాలల్లో ఘనంగా రామానుజన్ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశం శెట్టి తదితరులు పాల్గొన్నారు.



కేతేపల్లిలో రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తకోట రూరల్: శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శుక్రవారం మండలంలోని మిరాసిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'జాతీయ గణిత' దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హన్మంతు, ఉపాధ్యాయులు సత్యానారాయణ, భాస్కర్, నిస్సార్, సుబాష్‌చంద్రబోస్, చంద్రకళ తదితరులు ఉన్నారు.



మిరాసిపల్లి జెడ్పీహెచ్ స్కూల్‌లో..

మనిగిల్ల జెడ్పీహెచ్ఎస్‌లో..
పెద్దమందడి మండలంలోని మనిగిల్ల జెడ్పీహెచ్‌లో విద్యార్థులకు గణిత మేళా నిర్వహించారు. కోణాలు, వాటిని కొలవడం, త్రిభుజాలు, చతుర్భుజాల రకాలు, క్షేత్ర గణిత నమూనాలు, భిన్నాలు, సంఖ్యామానం, టాన్ గ్రామ్స్, కాలాన్ని తెలుసుకోవడం, దారాలతో డిజైన్లు రూపొందించడం, ముందు, తర్వాతి సంఖ్యలు వంటివి ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లుగౌడ్, బాలాజీ, విజయ్‌కుమార్, విష్ణువర్ధన్, శ్రీరాములు, లావణ్య, సురేఖ, కస్తూరి, శ్రీలక్ష్మి ఉన్నారు.

వీపనగండ్ల: రామానుజన్ జయంతి సందర్భంగా మండలంలోని పాఠశాలలో విద్యార్థులు ఆయన జీవిత చరిత్ర, గణితశాస్త్రంలో అవలంభించాల్సిన పద్ధతులపై విద్యార్థులకు వివరించారు. తూంకుంట పాఠశాలతో పాటు మండల కేంద్రంలోని డాఫోడీల్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం, పెబ్బేరు మండలంలోని పలు పాఠశాలలో గణిత దినోత్సవం నిర్వహించారు. పెబ్బేరు మండలంలోని రంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయుడు గోవర్ధన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం భాస్కర్, ఉపాధ్యాయులు ఎంఎస్ విజయకుమార్, నాగన్న, రాజశేఖర్‌గౌడ్, సురేందర్‌గౌడ్, మల్లికార్జున్, వరలక్ష్మి, అరుణశ్రీ, పర్వీన్‌సుల్తానా, దేవన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలులో వివక్ష



కొత్తకోట: దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రభుత్వం నుంచి వచ్చే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీలో నిర్లక్ష్యం చేయడమే కాకుండా డబ్బుల మంజూరులో వివక్ష చూపించారని కాంగ్రెస్ పార్టీ నాయకులు రాచాల యుగంధర్‌గౌడ్ ఆరోపించారు. శుక్రవారం కొత్తకోట పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాచాల యుగంధర్‌గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ వ్యవహారంలో వివక్షత చూపుతూ బీఆర్‌ఎస్‌కు చెందిన వారు సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఎక్కువ డబ్బులు మంజూరు చేయించారన్నారు. ఇతర పార్టీల వారు దరఖాస్తు చేసుకుంటే తక్కువ డబ్బులు మంజూరు చేయించడమే కాకుండా మంజూరైన చెక్కులను బాధితులకు ఇవ్వకుండా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారని మండిపడ్డారు. ప్రభుత్వ పథకాలు పార్టీలకు అతీతంగా ఉంటాయని, మాజీ ఎమ్మెల్యే మాత్రం తనకున్న అధికార పెత్తనంతో ఇష్టం వచ్చినట్లు వ్యవహరించారని ధ్వజమెత్తారు. గడిచిన తొమ్మిదేళ్లలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్ని శాఖల అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి తనకు అనుకూలంగా ఉంచుకుని నియోజకవర్గంలో ఇష్టానుసారంగా వ్యవహారం చేశాడన్నారు. అందుకే ప్రజలు ఇటీవల జరిగిన ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారని ఎద్దేవా చేశారు. ఇదివరకూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులు కాంగ్రెస్ పార్టీ నాయకులను సంప్రదిస్తే తగిన పరిష్కారం దొరుకుతుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో గొల్లబాబు, మాజీ సర్పంచ్ ధన్వాడ బాలస్వామి, మెడిశెట్టి రాజు, లక్ష్మయ్యయాదవ్, నరేందర్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, సాయిలుయాదవ్, మహేందర్ తదితరులు ఉన్నారు.

సాగునీటి విడుదలపై నిర్లక్ష్యం తగదు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం, పెబ్బేరు మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీలు గాయత్రి, ఆవుల శైలజ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘ చర్చ కొనసాగింది. పెబ్బేరు మండలంలో జరిగిన సమావేశంలో పెంచికలపాడు, జనుంపల్లి సర్పంచ్‌లు గోవిందునాయుడు, రాజవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ జూరాల కాల్వకు నీటి విడుదల నిలిపి వేయడం సరికాదన్నారు. డీ-19 కాలువ కింద సూగూరు, జనుంపల్లి, పెంచికలపాడు, మునుగమోనిదిన్నె గ్రామాల్లో పంట పొల్లాల్లో రైతులు 2 వేల ఎకరాల మిరప సాగు చేశారని, జూరాల కాలువకు ఫిబ్రవరి15 వరకు నీటి విడుదలను చేయాల్సి ఉండగా ఇప్పుడే నీటి నిలుపుదల చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు. జూరాల అధికారులు సభకు హాజరు కాకపోతే సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడంలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు రానప్పుడు సమావేశాలు ఎందుకని ప్రశ్నించారు. స్పందించిన జెడ్పీ చైర్మన్ వెంటనే ఇరిగేషన్ ఎస్ఈ సత్యశీలారెడ్డితో ఫోన్‌లైన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. సర్పంచులు గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు పద్మ, రాజేంద్రప్రసాద్‌యాదవ్, ఎంపీడీఓలు ప్రవీన్‌కుమార్, ప్రసన్నకుమారి, తహసీల్దార్లు, ఏఓ, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.



శ్రీరంగాపురంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

బడిఈడు పిల్లలు పాఠశాలకు..



పాన్‌గల్‌లో వివరాలు సేకరిస్తున్న సీఆర్పీలు



బాలకిష్టాపూర్‌లో..

పాన్‌గల్: బడిఈడు కలిగిన పిల్లలను పనులకు పంపకుండా బడికి పంపించాలని సీఆర్పీలు గోవింద్ నాయక్, కేశవులు విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం పాన్‌గల్‌లో బడిమానేసిన విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. 6 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలు బడి మానేయడానికి గల కారణాలపై ఆరా తీశారు. వారికి చదువు యొక్క ప్రాధాన్యత, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను వివరించి బడికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. బడికి పంపకుండా పనులు చేయిస్తే నేరమవుతుందన్నారు.

ఆత్మకూర్: బడి మధ్యలో మానేసిన పిల్లలను పనులకు కాకుండా బడులకు పంపాలని ఎంఈఓ భాస్కర్‌సింగ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గ్రామాల్లో బడిబయట పిల్లల సర్వే నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా సీఆర్పీ సౌమ్యరాణి ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరించారు. చదువు ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

పోలింగ్‌పై అవగాహన తప్పనిసరి



మాక్‌పోలింగ్ తీరును పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

- పొలికెపాడు జెడ్పీహెచ్ఎస్‌లో మాక్‌పోలింగ్
- విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్



ఓటు వేసిన అనంతరం సిరాచుక్క చూపుతున్న విద్యార్థులు

గోపాల్‌పేట: మండలంలోని పొలికెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు మాక్‌పోలింగ్ నిర్వహించి పోలింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు 200 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. శుక్రవారం మొత్తం 166 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న క్లాసులను మొత్తం ఐదు వార్డులుగా విభజించి ఐదుగురు వార్డు సభ్యులు, ముగ్గురు సర్పంచులు పోటీ చేశారు. ఓటు హక్కు పరిశీలించడం, ఓటు వేయడం, కౌంటింగ్ చేయడం, విజేతను ప్రకటించడం వంటి కార్యక్రమాలను విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించారు. ఓటు విధానంపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండటం, ఓటు ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఉపాధ్యాయులు శివరాజు, జానయ్య, రత్నకుమార్, మధుసూదన్ తదితరులు తెలిపారు.

సస్పెండ్ చేయడం తగదు

అమరచింత: నందిమళ్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తున్నామని జిల్లా నాయకులు ప్రకటించడం తగదని గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. జూరాల ఎడమ కాల్వకు యాసంగిలో సాగునీరు విడుదల చేయాలని రైతులతో కలిసి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కలిశామన్నారు. బంధువుల శుభ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లే సమయంలో చంద్రశేఖర్‌రెడ్డి, మండల వైస్ ఎంపీపీ వాహనంలో ఎక్కారని, దానికి సాకుగా చూపి సస్పెండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాములు, సుధాకర్, వెంకట్‌రెడ్డి, బాల్‌రాజ్, మునెప్ప, రాజేందర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి సారె అందజేత



కొత్తకోట రూరల్: పాలమాకుల సమీపంలో గల చిన్నజీయర్‌స్వామి ఆశ్రమం నందు ధనుర్మాసం సందర్భంగా శుక్రవారం కొత్తకోట 'వికాస తరంగిణి' ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు భీమా ప్రసన్నలక్ష్మి సభ్యులతో కలిసి సారె అందజేశారు. ప్రతి ఏడాది ధనుర్మాసంలో ఈ సారె ఇవ్వడంతో పాటు, వికాస తరంగిణి తరఫున ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నామని ప్రసన్నలక్ష్మి తెలిపారు. సారె అందజేయడానికి వచ్చిన మహిళలందరిని చినజీయర్‌స్వామి అభినందించారు. కార్యక్రమంలో వైష్ణవి, రాధిక, రజిని, విజయలక్ష్మి, సూర సుజాత, చంద్రకళ, భారతి, సుదర్శనమ్మ, స్వర్ణ విశ్వనాథం స్వాతి, కండె రాజ్యలక్ష్మి, రాధిక, శ్రీలత, ప్రభావతి, భగవద్గీత ఉన్నారు.

27న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కొల్లాపూర్: పట్టణంలోని నూతన గ్రంథాలయ భవనంలో ఈనెల 27వ తేదీన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తునట్లు చైర్ పర్సన్ విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. సమావేశానికి హాజరు కావాలని మంత్రిని ఆహ్వానించారు.

విద్యార్థులకు పురుగుల అన్నం పెట్టొద్దు



హెచ్‌ఎంతో వాగ్వాదానికి దిగిన నాయకులు

అమరచింత: పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పురుగులతో కూడిన అన్నం వడ్డిస్తున్నారని ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఏబీవీపీ మండల కన్వీనర్ అఖిల్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన తయారీలో పురుగుల బియ్యం వండుతున్నారని, వంట ఏజేన్సీ మహిళలు బియ్యంలోని పురుగులను తొలగించట్లేదని ఆరోపించారు. పాఠశాలలో పాత స్టాక్‌గా ఉన్న బియ్యాన్ని వెంటనే మార్చాలని పాఠశాల హెచ్‌ఎం బలరాముడుకు విన్నవించినా ఫలితం లేదని అసహనం వ్యక్తంచేశారు. పురుగుల అన్నం తినడంతో విద్యార్థులకు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో ఇళ్లకు వెళ్లి భోజనం చేస్తున్న పరిస్థితులు దాపరించాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యమైన బియ్యం అందించి మధ్యాహ్న భోజనంలో పురుగులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని హెచ్‌ఎం బలరాముడుకు అందించారు. కార్యక్రమంలో సందీప్, భరత్ పాల్గొన్నారు.

ఎంపీల సస్పెన్షన్ ఎత్తివేయాలి



శ్రీరంగాపురంలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

పెబ్బేరు రూరల్: పార్లమెంట్‌లో విపక్షానికి చెందిన 146 మంది ఎంపీల సస్పెండ్‌కు నిరసనగా శుక్రవారం పెబ్బేరు, శ్రీరంగాపురం మండల కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం చౌరస్తాలో నిరసన వ్యక్తం చేసి, కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో చోటు చేసుకున్న భద్రత వైఫల్యంపై బీజేపీ ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రస్తుతం దేశంలో అరాచక పాలన కొనసాగుతుందని మండిపడ్డారు. ఈ భద్రత వైఫల్యంపై కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు విజయవర్ధన్‌రెడ్డి, రాములు యాదవ్, పట్టణ అధ్యక్షులు కుమ్మరి గోవిందు, వెంకట్రాములు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్వాల సాయితేజగౌడ్, గంధం రాజు, సత్యనారాయణ, నాయకులు సర్వేశ్, వెంకటేష్ సాగర్, సురేందర్‌గౌడ్, నరేష్, అశోక్, మహేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



పెబ్బేరులో..

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

పెబ్బేరు రూరల్: పార్లమెంట్‌లో 146 మంది విపక్ష ఎంపీల సస్పెండ్ చేసినందుకు నిరసనగా శుక్రవారం జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో సీపీఐఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ భద్రత గురించి మాట్లాడితే సభ్యులను సస్పెండ్ చేస్తారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కురుమయ్య, జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, పుట్ట ఆంజనేయులు, రాముడు, బాలరాజు, సాయిలీల, రవి, గోపాలకృష్ణ, మద్దిలేటి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

అమరచింత: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందుతున్నారని వికాసత్ భారత్ సంకల్ప యాత్ర కోఆర్డినేటర్ శ్యాంసుందర్ అన్నారు. మండలంలోని చంద్రగఢ్, కిష్టంపల్లి గ్రామాల్లో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు జాతీయ ఉపాధి హమీ పథకం ద్వారా ఆదుకుంటుందని, వ్యవసాయ రంగంలో రైతులకు సబ్సిడీలపై యంత్రాలను అందిస్తుందన్నారు. వ్యాపారులకు బ్యాంకు ద్వారా రుణాలను అందిస్తు వారి వ్యాపారభివృద్ధికి దోహద పడుతుందని తెలిపారు. పోస్టాఫీస్‌ల ద్వార ఆడపిల్లలకు సుకన్య యోజన పథకం అమలు చేస్తుందన్నారు. అనంతరం వ్యవసాయ పొలంలో డ్రోన్ సహాయంతో మందుల పిచికారీ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, ఎంపీఓ నరసింహులు, ఏపీఓ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ రఘు, ఏఈఓ హరిత తదితరులు పాల్గొన్నారు.

